# కుంచికాశింజితం

శ్రీమతి డి. వర్ధని

నేను రాజేంద్రబోళ 747 ఫ్లైట్ లో ఇండియాకి ప్రయాణం చేస్తున్నాను. ఇంతకాలానికి తిరిగి మాతృభూమిపై అడుగిడబోతున్నానన్న సంతోషంతో నా మనస్సు ఉప్పొంగిపోతూంది....

విమానాశ్రయానికి బాబాయ్ వస్తాడో! రాడో? నేను వ్రాసిన ఉత్తరం అందిందో! లేదో? బాబాయ్ వృద్ధాప్యదశలో నన్ను గుర్తించగలడో! లేడో? నా బుగ్గమీద వున్న పుట్టుమచ్చని చూసైనా గుర్తించవచ్చు. నాన్నగారికి తోడబుట్టిన తమ్ముడు గాకపోయినా, చిన్నప్పటి నుంచి ఒక ఊళ్ళోనే కలిసి చదూవుకోడం వల్ల, వాళ్ళు బాల్యమిత్రులై అన్నదమ్ముల్లా కలిసిపోయేరు. చదువుపూర్తయి, వివాహం జరిగేక నాన్నగారు బోంబేలో వ్యాపారం బాబాయ్‌కి కూడా అక్కడే ఉద్యోగం రావడంతో ఇద్దరూ ఇంకా దగ్గరయ్యేరు. నాన్నగారు పోయినా ఆ చనువుతోనే బాబాయ్‌కి 'కరుణ నిలయం' విక్రయిస్తానని, అప్రయత్నం చెయ్యమని ఉత్తరం వ్రాసేను బోంబే దరిదాపులకు విమానం వచ్చిందన్న హెచ్చరిక నా ఆలోచనకి భంగం కలిగించింది. అందరూ నడుములకి బెల్టులు బిగించుకుంటు

న్నారు. ఐదు నిముషాల్లో విమానం శబ్దం చేస్తూ బొంబే శాంతాక్రజ్‌లో దిగసాగింది....

ప్రయాణికులతో పాటు నేను కూడా ద్వారం దగ్గర ఎయిర్ హోస్టెస్‌కి వీడ్కోలు చెప్పి క్రిందికి దిగేను. గొప్ప త్యాగమూర్తులైన నాయకులూ, కవులు, మహాత్ములు జన్మించిన భారత దేశం మీద కాలు మోపేను. ఈ మట్టి స్పర్శ తగలగానే నామేను మాతృమూర్తి స్పృశించినట్టయింది. ఆ ఆనందంతోనే చుట్టూ కలియజూసేను. విశాలమైన విమానాశ్రయం బైట ఎంతోమంది ఆత్మీయులు నిల్చొని వారి బంధువులకోసం నిరీక్షిస్తున్నారు. ఇక్కడ కూడ నాగరికత అనే నాట్యకత్తె పీఠం వేసి నృత్యం సాగిస్తూందే! అనుకుంటూ ఆ జన సమూహంలో భాబాయ్ కోసం అందర్నీ నిశితంగా చూడ సాగేను. సూర్యకిరణాలు ముఖానికి తాకడం చేత కాబోలు, ఫాలభాగం మీద చెయ్యి అడ్డం పెట్టుకుని, ఒక వ్యక్తి నా వైపే తదేకంగా చూస్తూ కనిపించేడు. భాబాయ్‌ని గుర్తించగలనా? అనే నా సంశయం, దట్టంగా వున్న మేఘాలు ఒక్కసారి విడిపోయినట్లు విడిపోయి నామనస్సు తేలికయింది. ఆయన వదనంలో ఆశ్చర్యాన్ని గుర్తించేను. నా పట్టుచీర, కుంకుమబొట్టు మెళ్లో నల్లపూసల దండ, చేతులనిండ గాజులు మొదలైన నా అలంకరణ గమనిస్తునట్టున్నారు.

" ఏం! భాబాయ్ కులాసాగా వున్నావా? నన్ను గుర్తించలేదా?" దగ్గరగా వెళ్ళి పలకరించేను.

భాబాయ్ వెంటనే తేరుకుని. "కరుణా! నిన్ను చూడగానే చాల సంతోషం కలిగిందమ్మా! విదేశాల్లో వున్నప్పటికీ నీవు మన సంప్రదాయం మరచిపోలేదు. ప్రయాణం కులాసాగా జరిగిందా? తల్లీ? అని ఆప్యాయంగా అడిగేడు నా తల నిముర్తూ ...

విమానాశ్రయం బైటికొచ్చి నేనూ బాబాయ్ కారులో కూర్చున్నాం. కారు తారురోడ్డు మీద జనసమూహంలోంచి మెల్లగా సాగిపోతుంది. నేను బోంబే వాతావరణాన్ని గమనిస్తున్నాను. నాన్నగారు ఇక్కడే వ్యాపారం ప్రారంభించి అభివృద్ధి సాధించేరు. స్వగృహం 'కరుణ నిలయం' కట్టించేరు ఒకరోజు నిద్రపోతున్న నన్ను మేల్కొల్పి ఎక్కడికో తీసుకెళ్ళేరు ఆ రాత్రి మా స్వగ్రామం వెళ్ళడం, అక్కడినుంచి కొన్నాళ్ళకి ఇంగ్లడు వెళ్ళిపోవడం జరిగింది. తర్వాత ఇంగ్లండులో నాన్న గారు అస్వస్థులుగా ఉండడం వల్ల నా చేత బాబాయ్‌కి ఉత్తరం వ్రాయించారు. అప్పుడు తెలిసింది నాకు, బోంబే ఎందుకు వదిలి పెట్టేమో? వ్యాపారంలో నష్టం రావడం వల్ల, పువ్వులమ్మిన చోట కట్టెలమ్మలేనని, తన బంధువు తనకి ఇంగ్లండులో ఉద్యోగం చూడడంతో తాను ఇంగ్లండు వెళ్ళిపోవడం జరిగిందని, చివరిగా ఎంతో ప్రీతితో తన కూతురు పేరుతో కట్టించిన స్వగృహం 'కరుణ నిలయం' చూడవలసిన బాధ్యత బాబాయ్ మీదే మోపుతున్నానని వ్రాయించి, తాళాలు కూడా బాబాయ్‌కి పంపించేరు. తర్వాత బాబాయ్‌కి నాన్నగారికి ఉత్తర ప్రత్యుత్తరాలు చాల జరిగేయి. పెద్ద పెట్టుబడితో చేసిన వ్యాపారంలో నష్టం వచ్చిందన్న దిగులు వల్ల నాన్నగారి ఆరోగ్యం పూర్తిగా చెడిపోవడం, నాకు వివాహం చెయ్యడం, మరి కొద్ది కాలానికే ఆయన మరణించడం. వరుసగా నాటకంలా జరిగిపోయేయి

"కరుణా! నీ ఉత్తరం అందడంతోనే ఒకరిద్దరు మార్వాడీలతో 'కరుణనిలయం' విక్రయం గురించి సంప్రదించేను. నెలరోజుల్లో విక్రయం జరిగిపోవచ్చు. మీ నాన్న ఎంతో ఆప్యాయంగా స్వగృహం కట్టుకున్నా ఎన్నాళ్ళో అందులో ఉండలేదు. నువ్వైనా అల్లుడు రిటైర్ అయ్యేక ఇంగ్లండు నుంచి వచ్చి

'కరుణానిలయం' లో వుంటావనుకున్నాను. ఇలా విక్రయిస్తావనుకోలేదు. 'కరుణానిలయం' ఏదశలో వుందో తెలిదు. నా ఆరోగ్యం బాగా లేక అటు వెళ్ళలేదు నేను ఈ రాత్రి ఒక స్నేహితుడింటికి పెళ్ళికి వెళ్ళాలి ఇదిగో తాళాలు అంటూ బాబాయ్ తాళాలు నాకిచ్చేశాడు.

తాళాలు అందుకుంటూంటే, రింగుకు అందంగా అమర్చబడ్డ వెండి మువ్వలు గలగలమని శబ్దం చేసేయి ఆ గలగల శబ్దంలో నాకు అనేకమైన అనుభూతుల స్పర్శ కలిగింది

ఏమిటో బాబాయ్! అందర్నీ పోగొట్టుకున్న దురదుష్టవంతురాల్ని ఆ గృహాన్ని వదిలి వెళ్ళిపోయినా, అంత్యకాలంలో కూడా నాన్నగారికి మనశ్శాంతి దొరకలేదు. మీ అల్లుడు గారికి రీసెర్చి ఇన్స్టిట్యూట్ లో ఉద్యోగం. రిటైర్ అయినా ఎక్కువ రీసెర్చి చేసుకుందికి అక్కడ అవకాశాలు యెక్కువ. అదీ కాక మా పిల్లలు అక్కడే చదువుతూ, ఆ వాతావరణానికి పద్ధతులకి అలవాటు పడ్డారు. అక్కడే స్థిరపడదామంటున్నారు. అందుకే 'కరుణనిలయం' విక్రయిద్దామని నిశ్చయించుకున్నాం.' అని వివరించేను 'కరుణనిలయం' పైవాళ్ళకి పోతుంది కదా! అన్న బాధ బాబాయ్ ముఖంలో నాకు స్పష్టంగా గోచరించింది.

సంధ్యా కాలంలో నేను స్వగృహ ప్రాంతం చేరేను, ఒక్క క్షణం గృహాభిముఖంగా నిలబడి అంతా కలియ చూసేను. అప్పుడే రకరకాల ఆత్మీయతా భావాలు సముద్రతరంగాల్లా నా మనస్సులో విజృంభించేయి ప్రహరీ గోడకున్న పాలరాతి ఫలకాన్ని స్పృశించేను. దుమ్ముపొర తొలగి 'కరుణనిలయం' అన్న నామం గోచరించింది. తండ్రి గారు "నా జీవితంలో మీ అమ్మతో వివాహం జరగడం, ఇక్కడ వ్యాపారం ప్రారంభించడం, నువ్వు జన్మించడం 'కరుణ

నిలయం' కట్టడం జరిగింది" అనడం స్ఫురించింది. ఒక్క నిట్టూర్పు వదలి గేటు తలుపులు 'కిర్రు' మనే ధ్వనితో తెరుచుకున్నాయి. గేటుకి ఇరువైపులా, పొడుగాపున్న అశోకవృక్షాలు గాలికి ఊగేయి. అవి నామీద గలగలమని స్మృతుల ఎండుటాకుల్ని రాలుస్తూ, స్వాగతం పలికి నట్టుయుంది. అత్యున్నతంగా ఆకాశంలోకి ఎదిగినా నన్ను మరచిపోని వృక్షాలపైకి దృష్టి సారించేను. ఇంతలో ఏదో కుక్క 'కుయ్యో' మని అరుస్తూ కాలు కుంటుకుంటూ ప్రక్కనుండి వెళ్లిపోయింది. దాని వైపు నాదృష్టి మళ్లింది.

భవంతి ముందున్న ఆవరణలో ఏవో మొక్కలు దట్టంగా పెరిగి వున్నాయి గేటు దగ్గరనుంచి వరండాలోకి వెళ్లేదారి మాత్రం, ఎవరో తుడిచి నట్లు పరిశుభ్రంగా వుంది. గేటు తలుపు తిరిగి మూస్తూంటే, కుడి ప్రక్క నుంచి చల్లని నీటిగాలి వీస్తూ మాతృమూర్తిలా స్పృశించింది. 'ఆహా' అనుకొని అటుచూసేను ఆవరణలో మొక్కలు దాటుకుంటూ చిన్న నీటికొలను చేరేను. అది బాగా పాకుడు పట్టివుంది. దాని మధ్యనున్న అహింసామూర్తి గౌతమ బుద్ధుని విగ్రహాన్ని తదేకంగా చూడసాగేను.

ఒక నాడు నాన్నగారు 'నీకే దేవుడంటే ఇష్టం' అని అడిగేరు "గౌతమ బుద్ధుడు సకల జీవులకు ముక్తిమార్గం చూపించేడు; అందుకే బుద్ధుడంటేనే యిష్టం" అన్నాను. నాన్నగారు వెంటనే బుద్ధుని విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారుచేయించి తెప్పించేరు. నేనూ బావా రోజూ పూలవనంలో పూలుకోసి మాలకూర్చి విగ్రహానికి వేస్తూండేవాళ్లం ఈ రోజు కూడా విగ్రహానికి పూలమాల అలంకరించి వున్నాదే! ఈనీటి కొలను చుట్టూ పరుగుపెట్టి దొంగాట ఆడుతుంటే ఒరోజు బావ నీళ్లలో పడ్డాడు. చిన్న చేపపిల్ల బావ నోట్లోదూరింది.

నన్నుగా నవ్వుకున్నాను. అల్లిబిల్లిగా అల్లుకున్న తీగ నాకాలికి

తగులుకుంది. నేను క్రిందికి చూసేను. రాధామాధవం పందిరి దాటి నేలమీద కూడా పరుచుకుంది. చిన్నప్పుడు ఈ తీగలాగే నేను హద్దులులేకుండా బావతో ఆడుకునేదాన్ని. ఇంతలో పారిజాతపుష్ప పరిమళం నన్ను పట్టుకుంది. ప్రతిరోజూ ఉదయం ఈ పూలు కోసి దేవుని పూజకి అందించేదాన్ని.

నేను వరండాలో కొచ్చేను. లతలు చెక్కబడివున్న పెద్ద తలుపుల్ని చూస్తూ తాళం తీసేను. వెండి మువ్వల గలగలల్తో తలుపులు పెద్ద హాలులోకి తెరుచుకున్నాయి. హాలంతా నామనస్సులాగే నిరుత్సాహంగా, చీకటిగా వుంది. నేను కిటికీ తలుపులన్నీ తెరిచేను నిద్రపోతున్న భవనం మేల్కొన్నట్టుంది. పడమటి కిటికీలోనుంచి అస్తమిస్తున్న సూర్యుడు నెత్తుటి ముద్దలా గోచరించేడు. దినమునే హంతకుడు అస్తమిస్తున్న సూర్యుడ్ని హత్య చేసి నట్లనిపించింది ఏవేవో చిన్న పురుగులు నా మీద వ్రాలేయి. వాటిని దులుపుకుంటూ హాలుకి కుడిప్రక్క వున్న గది తలుపులు తెరిచేను. ఎన్నో పాత కాగితాలు, విరిగిపోయిన బల్లలు, కుర్చీలు, ధూళితో నిండి నేల మీద అస్తవ్యంగా పడి వున్నాయి. అందులో మూలగా డస్కు పెట్టి ముందు, చాప చదరం మీద కూర్చుని, తదేకంగా ఆఫీసు కాగితాలు చూస్తూ వుండేవాడు గుమస్తా విశ్వనాథం. అతని చెవిలో చీపురుపుల్ల పెడుతూ అల్లరి చేసేదాన్ని. ఆయన గొల్లుమనేవాడు. "కరుణా! ఇది ఆఫీసు గది కదా? ఇక్కడ అల్లరి చెయ్యవచ్చా? తప్పు కదూ! లోపలికెళ్ళి ఆడుకో" అని నాన్నగారు అదిలించేవారు. గది మధ్యలో నాన్నగారు టేబిల్ కుర్చీలూ వేసుకొని, ఫైల్సు పెట్టుకుని, ఉదయం తొమ్మిది నుంచి పన్నెండు వరకూ, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు వరకూ. కూర్చునేవారు. ఎప్పుడూ వచ్చే పోయే జనంతో ఈ గది సందడిగా వుండేది రోజూ సాయంత్రం నాన్నగారు నన్ను

షికారు తీసుకెళ్లేవారు లైట్లు వేస్తూ, ప్రతీ గది పరీక్షించ సాగేను

ఆఫీసు గదిని ఆనుకొని పెద్ద గది వుంది. ఇది గుండ్రంగా ప్రత్యేకించి కట్టబడింది. ఈ గది తలుపులు పాడైవున్నాయి. తలుపులు తెరిచేను. లోపల్నుంచి పుస్తకాల ముక్క వాసన రువ్వుమని వచ్చింది. అది లైబ్రరీ గది. "కరుణా! ఆ మూల బీర్వాలో గురజాడ వారి రచనలు వుంటాయి. అందులో నుంచి 'పూర్ణమ్మ' కథ పుస్తకం ఇలా ఇవ్వమ్మా! అని నాన్నగారు అన్నట్టనిపించింది. పూర్ణమ్మ కథ అంటే నాన్నగారికి చాలా యిష్టం. దాన్ని 'స్పిరిట్యువల్ ట్రాజిడీ' అనేవారు. అంటే ఏమిటో నాకు తెలిసేదికాదు. నాన్నగారు, రాత్రి భోజనం చేసేక, ఈ గదిలో అర్ధరాత్రి పన్నెండు గంటల వరకూ చదివేవారు: చుట్టూ గుండ్రంగా వున్న రోజ్‌వుడ్ బీర్వాల్లో, ఆంగ్లాంధ్ర భాషా సాహిత్యాలలో పేరు పొందిన రచయితల గ్రంధాల్ని పొందికగా అమర్చబడున్నాయి. మధ్య రౌండ్ టేబిల్, చుట్టూ కుర్చీలు, వాలుకుర్చీ, గదిలో పరిచిన కార్పెట్ అన్నీ అలాగే చెక్కు చెదరకుండా వున్నాయి. అంతలో గబ్బిలం ఒకటి రెక్కలు ఊపుకుంటూ గదిలో ప్రవేశించి, తిరిగి బైటకి వెళ్లిపోయింది.

"యాత్రికుడా! యాత్రికుడా" మల్లవరపు వారి గీతాన్ని మృదు మధురంగా బావ ఆలాపిస్తున్నట్లు వినిపించింది ఆగది బావ కృష్ణది. అత్తయ్యకి కృష్ణుడంటే భక్తి; బావకి 'కృష్ణ' అని పేరు పెట్టింది. ఒక మూల మంచం, ఒకమూల టేబిల్ రెండు కుర్చీలు, ఒకమూల పాఠ్య పుస్తకాలతో నిండిన సెల్ఫ్ కనిపించేయి అక్కడ ఒక కుర్చీలో కూర్చున్నాను. 'అబ్బా! కరుణా! ఎన్నిసార్లు చెప్పినా మళ్లీ లెక్క తప్పు చేసేవు చింత మొద్దు' అని బావ పెన్సిల్‌తో నా తల మీద మొట్టి పెట్టినటయింది బావ చేత నాకు తెలీనివి చెప్పించుకునేదాన్ని.

బావని విసిగించాలని అన్నీ తప్పుగా చేసేదాన్ని. కాని పరీక్షలో అన్నీ కరెక్టుగానే చేసేదాన్ని. నాకు ఎప్పుడూ ఫస్టు మార్కులే వచ్చేవి. "చూడరా! మా బంగారు తల్లికి అన్నీ ఫస్టు మార్కులే; అది జీవితంలో కూడా ఫస్టే" అని అత్తయ్య ముద్దులాడేది. "ఆ! మావయ్య పెద్ద వ్యాపారస్తుడని టీచర్లు మార్కులు వేసివుంటారు, అని బావ నన్ను వుడికించేవాడు. బావ ఎంతో సాత్వికుడు. ఈ గదిలో ఎప్పుడూ చదువుకుంటూ వ్రాసుకుంటూ వుండేవాడు. ఒకరోజు పొద్దుట ఇల్లు వదిలి వెళ్ళిన బావ తిరిగి రాలేదు. అత్తయ్య బెంగతో మంచం పట్టింది కొన్నాళ్ళకు. "దేశసేవ అత్యున్నతమైంది. తాను సైనిక దళంలో చేరేనని, బెంగ పెట్టుకో వద్దని,' బావ ఉత్తరం వ్రాసాడు. అత్తయ్య ఏదైతే జరగకూడదని భావించిందో అదే జరిగింది. బహుశా వారసత్వం అంటే ఇదే కాబోలు, రూపంలోనే కాకుండా బుద్ధిలో కూడా తండ్రి పోలికే వచ్చింది బావకి. మామయ్య కూడా యుద్ధంలోనే వీరస్వర్గం అలంకరించాడు. చివరికి అత్తయ్య బెంగతో మరణించింది.

హాలుకి ఎడమ ప్రక్కగా వున్న గది తాళం తీసి ఉత్సాహంతో గదిలో అడుగు పెట్టేను. నా గది ఎప్పుడూ చిందర వందరగా వుండేది. అత్తయ్య నన్ను నిద్ర లేపుతూ "కరుణా వల్ల సివాడు పద్మనయమ్ముల వాడు అన్న పద్యం చదువమ్మా!' అని అడిగినట్లు అనిపించింది. నన్ను బాల్యం నుంచి అత్తయ్యే దగ్గరుండి పాఠాల్ని చదివించేది. ఈ అల్మైరాలో బొమ్మలన్నీ దాచుకుని తాళం వేసేదాన్ని. నేను చాల ధైర్యవంతురాలిలా వుండేదాన్ని. కాని చీకటంటే చచ్చేంత భయం. రాత్రి ఈ గదిలో అత్తయ్యని కౌగలించుకుని నిద్రపోయేదాన్ని. రాత్రి అత్తయ్య 'భాగవతం' లో కృష్ణ లీలల్ని గూర్చి చెప్పేది. అమ్మ అత్తయ్య కోసం ఎప్పుడైనా నా గదిలో కొచ్చి, 'ఏం కోడలివి తల్లీ! అత్తగారితో సేవలు చేయించుకుంటున్నావు. నువ్వు

చెయ్యొద్దం పోయి,' అనేది. నవ్వుతూ! ఆ మాటలర్థం నాకు ఆ చిన్న వయస్సులో తెలిసేది కాదు.

నేను అమ్మగదిలోకి వెళ్లాను. ఎదురుగా గోడకున్న తల్లి దండ్రుల తైలవర్ణ చిత్రాలు దుమ్ముపట్టి వున్నాయి. దగ్గరగా వెళ్ళి దుమ్మంతా తుడిచేను. వారి ప్రసన్న దృక్కులు ఒకసారి ఆశీస్సుల్లా నాపై పడ్డాయి "చూడు కరుణా! నువ్వు అల్లరి మానేసి బాగా చదువుకొని తల్లి దండ్రుల పరువ నిలబెట్టాలమ్మా !" అని అమ్మ అంటున్నట్లు తోచింది ఆ నాటి మా మాతృమూర్తి సుందర స్వరూపం ఒకటే నిలయానికే కళ తెచ్చి లక్ష్మీనివాసంలా వుండేది. ఆమె వామన కాయ రూపం, . నుదుట రూపాయంత కుంకుమ బొట్టు, భూదేవి వంటి సహనం, అన్నపూర్ణ వంటి స్వభావం, అందరికీ సంతృప్తి నిచ్చేవి. కార్తీకమాసంలో, కృష్ణా నదీ స్నానాలూ, భగవదారాధనలూ చేసి వచ్చిన కొద్ది రోజుల్లోనే మాతృమూర్తి జబ్బుతో మంచం పట్టింది చివరికి తమ్ముని నాన్నగారికి అప్ప చెప్పి కన్ను మూసింది. అమ్మ నిద్రించే మంచమీద వాలిపోయాను. అమ్మ స్పృశించినట్లు మేను పులకించింది దానికి నాకు వివాహం చెయ్యాలన్న అమ్మ కోరిక తీరనే లేదు. "విధి విధానం చాల విచిత్రమైంది" అనుకుంటూ మంచం మీద నుండి లేచేను ఆ మూల ద్వారం తెరిచి వుంది అమ్మ ఎప్పుడైనా నన్ను తన దగ్గర నిద్రపుచ్చినా అర్ధరాత్రి వేళ లేచి, ఈ ద్వారం గుండా అత్తయ్య దగ్గరకెళ్లి నిద్రపోయేదాన్ని.

నేను అన్ని గదులూ పరిశీలిస్తూ అమ్మ ప్రతిదినం ఆరాధించే భగవన్నివాసం చేరేను. ప్రాతః సమయంలో అమ్మ ధూపదీప నైవేద్యాలతో పూజ చేసి, 'కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే! ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్॥'' అని స్తవం చేస్తున్నట్లు గోచరించింది. ఈ గృహాన్ని రక్షిస్తూ అభయమిస్తూ ఎదురుగా

పూజావేదిక మీద శ్రీకల్యాణ చక్రవర్తి నేటికీ నిలిచి వున్నాడు "స్వామీ! ఈ గృహంలోనే వాళ్లరతా గతించారు. బావ ఎక్కడున్నాడో తెలీదు. సంపదంతా ఎక్కడే పోయింది. అఖరికి మనశ్శాంతి కోల్పోయిన నాన్నగారు ఈ గృహాన్ని తలుచుకుంటూ కన్ను మూసేరు. నాకింకేం మిగిలింది. నామీద కొంచెం కూడా దయలేదా! స్వామీ? అన్నీ యిచ్చి నట్టే యిచ్చి తిరిగి దోచుకున్నావు.' అని దుఃఖిస్తూ గుమ్మాని కానుకుని నిలబడ్డాను. దుఃఖోపశమనం పొందే కే "అజ్ఞానం వల్ల ఇలా దుఃఖిస్తున్నానే కాని, సకల జీవరాసులు జన్మించంది నీవల్లే కదా? అత్తయ్య అమ్మ నాన్న వీరందరి ఆత్మలూ నీలోనే ఉన్నాయి. ఈ ప్రపంచంలో మానవులంతా రైలుబండిలో ప్రయాణం చేసే ప్రయాణీకులు, ఎవరి పూరు రాగానే వాళ్లు దిగిపోయినట్లు, ప్రపంచంలో వారి విధులు నిర్వర్తించి వెళ్ళిపోతారు. ఈ మమతా ద్వేషాలు, సుఖ దుఃఖాలు మాత్రమైనా మానవులకు మిగిలేది? అంతా మాయేనా? ఈ తాపత్రయ పూరితమైన జీవ యాత్రలో యింకేముంది? ఇదంతా నీ సృష్టి రహస్యమేనా? ప్రభూ!' అని తర్కింకుంటూ, తెలికపడ్డ మనస్సుతో, సర్వాంతర్యామికి అంజలి ఘటించేను

నేను వీధి ద్వారం తెరచి గృహ ప్రాంగణంలోకి వచ్చి స్తంభాని కానుకున్నాను. మలయ మారుతం ఒక మారి నా మేను స్పృశించింది. అప్పుడే చీకట్లు విడిపోతున్నాయి. రాత్రి అనే మాయలో మునిగిన సూర్యుడు తన కాంతి కిరణాలతో లేవ తున్నారు. నేను 'కరుణ నిలయం' తాళం వేయ్యాలని తలుపు వేవ తిరిగేను వరండాలో ఒక వ్యక్తి నిద్రస్తున్నారు. మాసిన తాకి దుస్తులు, మాసిన గెడ్డం, ప్రక్కన ఊతకర్రలు బిచ్చగాన్ని తలపింప చేస్తున్నాయి. అరుణ కాంతులు అతని ముఖం మీద వ్యాపించేయి నేను అతన్ని గుర్తిం

ది అచేతనంగా నిలబడ్డాను.

"నా స్మృతి చిహ్నం 'కరుణా నిలయం' ఇక విక్రయించ లేను" అనుకున్నాను. దూరాన దేవాలయంలో ప్రత్యూష ఘంటలు మ్రోగేయి. నేను తాళాలు అతనిముందుంచేను. సమస్యాపరిష్కారమైన నా మనస్సు తెల్లని పావురంలా ఎగిరి వెళ్లి సూర్యోదయం కాంతిలో కలిసి పోయింది.

అశోక వృక్ష ఛాయలలో నేను మెల్లగా అడుగులు వేసుకుంటూ గేటు వైపు సాగిపోయేను....

* * *


*With best compliments from:*

SREE HUNUMAN PRINTING WORKS

VASANTHARAO VARI STREET
VISAKHAPATNAM-1